క్లుప్తంగా

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు 'సంక్షేమం'



నెహ్రూనగర్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని క్లస్టర్–4 అధ్యక్షుడు అగ్గిపెట్టె రాజు పేర్కొన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి 162 సచివాలయం పరిధిలోని వెంకటాద్రిపేట ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పథకాలు మరలా కొనసాగాలంటే వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసుకోవాలని సూచించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల్ని డివిజన్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, క్లస్టర్ ఇన్‌చార్జ్ చిలక రమేష్, మిర్చి యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఎర బ్రాబు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంహెచ్ఓగా మధుసూదన్



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి(ఇన్‌చార్జి ఎంహెచ్ఓ)గా బయాలజిస్ట్ మధుసూదన్‌ని నియమిస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ భానుప్రకాష్ ఉన్నత చదువు నిమిత్తం వెళ్లారు. ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల్ని బయాలజిస్ట్ మధుసూదన్‌కి కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

హిందీ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన రాజ భాష హిందీ ఒలింపియాడ్ పరీక్షల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్వర్ణ పతకాలు సాధించిన ఐదుగురు విద్యార్థులతో పాటు ప్రశంసాపత్రాలు పొందిన 137 మంది విద్యార్థుల్ని అభినందించారు. మాతృ భాషతో పాటు జాతీయ భాష హిందీలో సైతం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఏటా ఇదే విధంగా విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని, మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సౌజన్య, నాగమల్లేశ్వరి, కాత్యాయినిని అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామిపై కాలనీవాసుల ఆగ్రహం

నెహ్రూనగర్: బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా పూర్తి చేయడం లేదంటూ వెంకటకృష్ణ కాలనీ (బండ్ల బజార్)వాసులు నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాలు వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో ఓ రోడ్డు విస్తరణ చేసే క్రమంలో మొత్తం 33 గాను 30 ఇళ్లను పట్టణ ప్రణాళిక అధికారులు కొట్టి వేశారన్నారు. మిగిలిన మూడు ఇళ్లను తొలగించకుండా ఒకటిన్నర సంవత్సరం నుంచి టౌన్ ప్లానింగ్ సెక్షన్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. మూడు ఇళ్ల వల్ల రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు తెలిపారు. లక్ష్మణస్వామి కావాలని వారి ఇళ్లు తొలగించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలంటూ నినాదాలు చేశారు.

నాగరిక సమాజపు అసలైన లక్షణం సహనం



లక్ష్మీపురం: నాగరిక సమాజపు అసలైన లక్షణం సహనమని, తెలియని విషయాలను తెలుసుకోవడానికి సహనమే ఉత్తమ మార్గమన్న విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ సహన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసహనం భావోద్వేగ ప్రతికూల ప్రవర్తనను పెంచి పోషిస్తుందని, సహనం శాంతిని ప్రసాదిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల సమస్యకు శాశ్వత పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



నూరీ ఫాతిమాతో కలిసి తూర్పు నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: తూర్పు నియోకవర్గంలో పలు ప్రాంతాల ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్‌మెంటు పక్క నుంచి అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పనుల్ని కాంట్రాక్టర్ వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లతో కలసి శనివారం కమిషనర్ అవుట్ ఫాల్ డ్రెయిన్ పనులు, నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం వల్ల ప్రధానంగా పట్నం బజార్, పూల మార్కెట్, ఏటుకూరు రోడ్డు, లాంచెస్టర్ రోడ్డు, సంగడి గుంట, ఎల్.ఆర్.కాలనీ, కబాడీ గూడెం తదితర ప్రాంతాల్లో ముంపు సమస్య తీరుతుందని తెలిపారు. వర్షాలకు నీరు వెళ్లే అవుట్ ఫాల్ డ్రెయిన్లు సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్‌మెంటు పక్క నుంచి 850 మీటర్ల అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను రూ.3.53 కోట్లతో నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనుల వేగవంతం చేయడానికి గానూ ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. కాంట్రాక్టర్ కూడా నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ పనుల్ని వేగంగా చేసేలా పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. అనంతరం నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించి, పురోగతిపై ఏఈని వివరాలు అడిగారు. ప్రహరి నిర్మాణం వేగంగా జరగాలని చెప్పారు. పర్యటనలో ఎస్ఈ భాస్కర్, డీసీపీ కోటయ్య, కార్పొరేటర్లు వేముల జ్యోతి పద్మజ, సంకూరి శ్రీనివాసరావు, ఈఈ కోటేశ్వరరావు, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, గోవర్ధన్, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

నగరంలో రహదారుల విస్తరణ వేగవంతం

మేయర్ కావటి



పనులను పరిశీలిస్తున్న మేయర్

నగరంపాలెం: గతంలో కంటే ప్రస్తుతం గుంటూరు నగరంలో రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనుల్ని శనివారం ప్రజా ప్రతినిధులు, జీఎంసీ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలోని ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి చాలా కీలకమైనదని తెలిపారు. 24, 30, 31 డివిజన్లతో పాటు పల్నాడు జిల్లా వైపు నుంచి గుంటూరు నగరంలోకి ప్రవేశించేందుకు అనువైన రహదారని పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు రూ.13 కోట్లతో 80 అడుగుల మేరకు రహదారి విస్తరణ చేపడుతున్నామని చెప్పారు. విస్తరణలో 182 గృహాలు ఉండగా, అందులో సుమారు 170 మంది స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. మిగతా కొందరు కోర్టుకు వెళ్లడంతో రహదారి నిర్మాణ పనులు స్తంభించాయని చెప్పారు. త్వరలో వారి ఆమోదంతో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. రహదారిని విస్తరించి సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, డ్రెయిన్లను నిర్మించి, ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని చెప్పారు. గుంటూరు నగరంలో వైఎస్ఆర్ సీపీ పాలకవర్గం ఏర్పడిన తరువాత సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు కుల, మత, పార్టీలకతీతంగా అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో 2014–2019 వరకు భూగర్భ డ్రైనేజీ పనులతో నగరాన్ని గుంతలూరుగా మార్చారని ఆరోపించారు. నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ దృష్ట్యా నగరంలో పలు ప్రధాన రహదారుల్ని విస్తరిస్తున్నామని తెలిపారు. అందులో ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి, పలకలూరు రహదారి, రామనామక్షేత్రం, కొత్తపేట శివాలయం, కేవీపీ కాలనీ రహదారులు ఉన్నాయని చెప్పారు. ఎక్కువ శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని తెలియజేశారు. టీడీపీ, జనసేన ఎన్ని అసత్య ఆరోపణలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రజలు వై.ఎస్.జగన్‌ను మరల సీఎంగా ఎన్నుకుంటారని మేయర్ కావటి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, ఆడకా పద్మావతి, జీఎంసీ ఎస్ఈ భాస్కరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, పార్టీ నాయకులు సింగు నరసింహారావు, టౌన్ ప్లానింగ్ అధికార, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కత్తితో ఇద్దరిపై దాడి

గుంటూరు ఈస్ట్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి సమీప బంధువులపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 17న సాయిబాబా రోడ్డులోని ఇంటిలో మర్రిపూడి సైదులు టీవీ చూస్తున్న సమయంలో సమీప బంధువు అయిన రిత్విక్ కత్తితో దాడి చేశాడు. వీరి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. సైదులు పెద్దగా కేకలు వేయడంతో అతని సోదరుడు అక్కడకు వచ్చి రిత్విక్‌ను అడ్డుకోబోయాడు. అతని పైనా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఊపిరి తీసిన ఉయ్యాల

బాలిక ఉయ్యాల ఊగుతున్న సమయంలో మెడకు ఉరి పడి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్‌గాంధీ నగర్ 3వ లైనులో అచ్చమ్మ నివాసం ఉంటోంది. ఆమె వద్ద మనుమరాలు బొంత కావ్య తిరుపతి (12) ఉంటోంది. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కావ్య ఉయ్యాలలో ఆడుకుంటూ మెలికలు తిరుగుతూ ఉండగా, ప్రమాదవశాత్తు మెడకు ముడిపడింది. ఈ ప్రమాదంలో కావ్య మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న షేక్ నూరి ఫాతిమా

పట్నంబజారు: నగరం అభివృద్ధి పనులతో శరవేగంగా ముందుకు సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మురళి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం నందివెలుగు రోడ్డులో జరుగుతున్న మరమ్మతుల్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నందివెలుగు రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, ఇర్రి సాయి, ఎరబ్రాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నెహ్రూనగర్: అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు గుంటూరు డిస్ట్రిక్ట్ ప్రొహిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఆ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది సహకారంతో హెడ్ కానిస్టేబుళ్లు ఆర్. శ్రీనివాసరావు, ఐ. వి. భూపతి కుటుంబ సభ్యులకు రూ.95 వేలు చొప్పున ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరామిరెడ్డి, పల్నాడు జిల్లా సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు మార్పు కోటయ్య, అసోసియేషన్ నాయకులు బి.ఎస్.ఎన్. రాజు, శ్రీమన్నారాయణ, శంకరరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

గుంటూరు మెడికల్: విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ గుంటూరు శాఖ, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెనిటేనియల్ సంయుక్త ఆధ్వర్యంలో కొరిటెపాడు విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ కోట ప్రగతి, డాక్టర్ గాజుల రామకృష్ణ, డాక్టర్ యలవర్తి కిరణ్, డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ తదితరులు సేవలందించారు. 350 మంది పేదలకు వైద్య పరీక్షలతో పాటు మందులు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కె.బుల్లి కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పి.వి. రమణరావు, జోనల్ మేనేజర్ సీహెచ్.వి. సుబ్రహ్మణ్యం, సంగటిగుంట బ్రాంచ్ మేనేజర్ కనకారావు, పి శిరీష, రెండు బ్రాంచీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్రాజు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానం

గుంటూరు వెస్ట్: సర్రాజు వేణుగోపాలరావు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆదివార సాయంత్రం 7 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ విలువలతో ఉపాధ్యాయ వృత్తికే గౌరవం తెచ్చిన గోపాలరావు పేరుతో ఏటా తమ కుటుంబ సభ్యులు ప్రతిభగల కొందరిని ఎంపిక చేసి యశస్వి పురస్కారంతో సత్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అవార్డులను నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ఎంపీయూపీఎస్ లేమల్లెపాడు ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, చలనచిత్ర దర్శకుడు ఎస్.వై. గౌతం రాజులకు అందజేస్తామని తెలియజేశారు.

అలరించిన కూచిపూడి నృత్యం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా శనివారం ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆలయ సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, విశ్రాంత జస్టిస్ కె.జి.శంకర్ పాల్గొన్నారు. పాఠశాల అధ్యాపకులు ఏం.వి. సుబ్బరామయ్య బృందం నాద స్వర కచేరీ వీనులవిందుగా సాగింది. అనంతరం నాట్యాచార్య కె.వి.సుబ్రహ్మణ్యం శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.


ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు ఉపసంహరించుకోవాలి: ఏపీటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు గుంటూరు డీఈవో ఇచ్చిన చార్జ్ మెమోలు ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం డీఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు జారీ చేసిన చార్జ్ మెమోలు ఉపసంహరించుకోని పక్షంలో, పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీల సమయంలో విద్యార్థుల ఎదుట హెచ్ఎంలు, టీచర్లను కించపర్చే విధంగా వ్యవహరించడం తగదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవో నాయకులు మూర్తి, పెన్షనర్స్ నాయకులు నాగరాజు, దాస్, రమేష్, శ్రీలక్ష్మి, సత్యనారాయణమూర్తి, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదరణ కరువైన టీడీపీ, జనసేన నిరసన

నగరంపాలెం: టీడీపీ, జనసేన శనివారం ఏటీ అగ్రహారం ప్రధాన రహదారిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆదరణ కరువైంది. రూ.13 కోట్లతో ఈ రహదారి విస్తరణ పనులు జరుగుతుంటే ఆందోళన చేపట్టడం స్థానిక ప్రజల్ని విస్మయానికి గురిచేసింది. రోడ్డు అభివృద్ధి చేయడం రెండు పార్టీలకు ఇష్టం లేదా? అని చర్చించుకున్నారు. ఎస్కేబీఎం ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన నిరసన ర్యాలీ ఏటీ అగ్రహారం జీరో వీధి వరకు కొనసాగింది. మళ్లీ అక్కడ నుంచి ఏటీ అగ్రహారం నాలుగో వీధి సగం వరకు వెళ్లి వెనుదిరిగారు. ఇక కొత్తగా సైడు కాల్వలు నిర్మించగా, మురుగునీరు పారుదలయ్యే క్రమంలో రహదారిపైకి నీరు చేరింది. అక్కడ జనసేన, టీడీపీ నేతలు ఫొటోలు, సెల్ఫీలు దిగడం కనిపించింది. రహదారి ఇరువైపులా ఎవరితోనూ మాట్లాడలేదు. నినాదాల చేసుకుంటూ ముందుకు సాగారు. అభివృద్ధి పనులు జరిగే చోట ఎవరితోనైనా మాట్లాడితే వ్యతిరేకత వస్తుందనే ఆలోచనతో మిన్నకుండిపోయారు.

ఆరు బయట మల విసర్జనతో అనారోగ్యం



నెహ్రూనగర్: ప్రతి ఒక్కరూ మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్లనే ఉపయోగించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ గురవయ్య తెలిపారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకొని కృష్ణబాబు కాలనీలో ఐటీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు, కాలనీవాసులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆరు బయట మల, మూత్ర చేయడం ద్వారా అనారోగ్యంతో పాటు వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఆయన సూచించారు.

ఆక్సిజన్ థెరపీపై అవగాహన అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్సిజన్ థెరపీపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన అవసరమని ఎన్నారై మెడికల్ కళాశాల పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రామకృష్ణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం ఆక్సిజన్ థెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఆక్సిజన్ ఆవిష్కరణ, తయారు చేసే విధానం, భద్రపర్చడం, తీసుకునే ఆహార పదార్థాల వినియోగంలో ఆక్సిజన్ పాత్ర గురించి వివరించారు. శ్వాస సంబంధిత వ్యాధులు, గుండెపోటు, అనీమియా, తీవ్రమైన కాలిన గాయాలకు చికిత్సా పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ కె. హేమకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జె. శివజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరువగా సమగ్రశిక్ష బడ్జెట్



మాట్లాడుతున్న డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కుచట్టంతో పాటు నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరువగా సమగ్ర శిక్ష బడ్జెట్‌ను రూపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. శనివారం పాతబస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో సమగ్రశిక్ష 2024–25 వార్షిక బడ్జెట్ ప్రణాళికపై ఎంఈఓలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ శైలజ మాట్లాడుతూ విద్యార్థి కేంద్రంగా బడ్జెట్ రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ 2022–23 యూ డైజ్ డేటాను ప్రాతిపదికగా చేసుకుని ఖచ్చితమైన సమాచారంతో ప్రణాళికను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రణాళిక రూపకల్పనలో పొందుపర్చాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌లో ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐఓ జీకే జుబేర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఉమాదేవి, డైట్ ప్రిన్సిపాల్ షేక్ సుభానీ, గుంటూరు, తెనాలి డీవైఈవోలు పి. వెంకటేశ్వరరావు, నిర్మలారాణి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఏఎంఓ సాయి ప్రసాద్, ఏపీఓ సీతారామయ్య, జీసీడీఓ సుజాత, ఏఎస్ఓ జయ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అగౌరవం, వ్యంగ్యంగా పోస్ట్‌లు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు



గుంటూరు అరండల్‌పేట సీఐ రామానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నటుడు పోసాని కృష్ణమురళి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజులపై ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి వ్యంగ్యంగా, అగౌరవంగా పోస్టులు పెట్టడంపై న్యాయవాదులు అరండల్‌పేట పోలీసుస్టేషన్ శనివారం ఎస్‌హెచ్ఓ రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయవాది వేముల ప్రసాద్ మాట్లాడుతూ అడుసుమల్లి వెంకట అప్పారావు ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి, ఐజీ, సినీనటుడు పోసాని కృష్ణమురళిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టి అగౌరపరిచాడని తెలిపారు. ఒక రాజకీయ పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశారని పేర్కొన్నారు. వెంకట అప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టర్లు పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బి.కోటేశ్వరరావు, సీడీ భగవాన్, క్రాంతికుమార్, జయపాల్, శ్రీనివాసరెడ్డి, షేక్ నజీర, కృష్ణారెడ్డి తదితరులు స్టేషన్‌కు వచ్చిన వారిలో ఉన్నారు.

రోజాబాయి కుటుంబానికి ప్రభుత్వం, ఎస్టీ కమిషన్ అండ

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్
- రూ. 50వేల చెక్కు మంజూరు పత్రం, నిత్యావసరాల అంజేత



రోజాబాయికి మంజూరు పత్రం, నిత్యావసరాలు అందజేస్తున్న శంకర్ నాయక్

కొరిటెపాడు(గుంటూరు): నగరానికి చెందిన గిరిజన మహిళ కేతవత్ రోజాబాయిపై అనుచితంగా ప్రవర్తించి దాడి చేయడం అమానుషం అని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. రోజాబాయి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గుంటూరు మిర్చి యార్డులో దాడికి గురైన గిరిజన మహిళ కేతవత్ రోజాబాయిను నల్లచెరువు సమీపంలోని వర్కర్స్ కాలనీ 2వ లైనులో ఆమె నివాసంలో శనివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కరించడానికి అన్ని విధాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.2 లక్షల సాయం ప్రకటించిందని, మొదటి విడత రూ.50 వేలుకు సంబంధించి ప్రొసీడింగ్స్ జిల్లా యంత్రాంగం అందించిందని తెలిపారు. నెలకు సరిపడా నిత్యావసరాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.ప్రభాకర్‌రెడ్డి, డీఎస్పీ మహబూబ్ బాషా, తహసీల్దారు నగేష్, నల్లపాడు సీఐ రాంబాబు, స్థానిక కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.